సంక్రాంతికి జర భద్రం

గాలిపటాలు ఎగురవేసేటప్పుడు పయిలం ● నిర్లక్ష్యంగా ఉండొద్దంటున్న పోలీసులు

ఘట్‌కేసర్: సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున ప్రజలు సిద్ధమవుతున్నారు. కొందరు శనివారమే పయనం కాగా.. మిగిలిన వారు ఇంటికి వెళ్లే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పరుశురాం ప్రారంభించారు.


ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పరుశురాం

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని పగలు రెక్కీ నిర్వహించి చీకటి పడగానే ఇళ్లలో చోరీలకు పాల్పడుతుంటారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసుల సూచనలను పాటించాలని కోరుతున్నారు. సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- ద్విచక్రవాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణం చేయకూడదు. ప్రయాణానికి ముందే వాహనం పనితీరును చూసుకోవాలి.
- లగేజ్ బ్యాగులు వాహనం రెండు వైపుల కట్టకూడదు. స్త్రీల చీర కొంగులు, చున్నీలు చక్రాల్లో పడకుండా జాగ్రత్తగా ఉండాలి.
- రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయకూడదు. చేసినా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.
- నిద్రమత్తు, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదు. దూరపు ప్రయాణాలైతే గంటకోసారి వాహనం నిలుపుకోవాలి. అతి వేగం పనికిరాదు.

గాలిపటం ఎగురవేసేటప్పుడు..

- గోడలపై నిలబడి గాలిపటాలను ఎగురవేయడం , పతంగులు తెగిన సమయంలో వాటికోసం దారి చూసుకోకుండా పరిగెత్తడంతో ప్రమాదాలు జరుగుతాయి. కాగితాలతో తయారు చేసిన పతంగులే వినియోగించాలి.
- ఇతర పతంగులను తెంపాలని గాజు, సీసం ముక్కలను కలిపి కోడిగుడ్డుతో తయారు చేసిన మాంజాను వినియోగించకూడదు. దీనితో పాటు చైనా మాంజా కారణంగా పక్షులు మృత్యువాత పడతాయి.

పోలీసుల సూచనలు...

- ఊరెళ్తే ఇంటి పక్కన ఉండే వారికి ఇంటిపై నిఘా పెట్టాలని కోరాలి. వాహనాలను ఇంటి లోపల నిలపాలి. పేపర్, పాలవాళ్లను రావొద్దని ముందే చెప్పాలి.
- ఇంట్లో ఎప్పుడూ ఒక లైటును వేసి ఉంచాలి. ఖరీదైన నగలు, నగదు ఇంట్లో పెట్టకూడదు.
- డోర్‌కు వేసిన తాళం కనిపించకుండా కర్టెన్ వేయాలి. గేటుకు లోపలి నుంచి కూడా తాళం వేయాలి. డోర్‌కు సెంటర్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలు బిగించుకుని మొబైల్ యాప్ ద్వారా సీసీ కెమెరాలను పర్యవేక్షించాలి. ఫుటేజీలను పరిశీలిస్తూ ఉండాలి. ప్రధాన ద్వారం వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. విలువైన వస్తువులున్న బ్యాగులను పెద్దలు తమ దగ్గరే ఉంచుకోవాలి. నివాసప్రాంతాల్లో కొత్త వ్యక్తులపై అనుమానం వస్తే 100కు కాల్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

పోలీసుల సూచనలు పాటించాలి



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఊర్లకు వెళుతున్న నేపథ్యంలో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రజలు తప్పనిసరిగా పోలీసుల సూచనలు పాటించాలి. ఇంటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. విలువైన వస్తువులు, నగదు ఇంటిలో ఉంచకూడదు. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే 100 టోల్ ఫ్రీ నంబర్‌కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

-పరుశురాం, ఇన్‌స్పెక్టర్ ఘట్‌కేసర్

మార్కెట్‌లో సంక్రాంతి సందడి





ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మార్కెట్‌లో సంక్రాంతి సందర్భంగా ఆదివారం సందడి నెలకొంది. చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా గాలిపటాలను కొనుగోలు చేస్తున్నారు. ముగ్గుల కోసం మహిళలు రంగులు కొనుగోలు చేస్తున్నారు. నవ ధాన్యాలు, పూలు, చెరుకు గడలు, రేగు పండ్లు ఇతర సామాగ్రిని కొనుగోలు చేయడానికి తరలి రావడంతో దుకాణాలు కిక్కిరిశాయి. పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్, అంబేడ్కర్ చౌరస్తా, ఏదులాబాద్ రోడ్డులో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు.

మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలిగా జల్లి శైలజ



మేడ్చల్/శామీర్‌పేట్: మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలిగా మాజీ జెడ్పీటీసీ జల్లి శైలజ ఎన్నికయ్యారు.ఈ మేరకు ఆదివారం బీజేపీ ఎన్నికల అధికారి మురళీధర్‌గౌడ్ ఆమె నియామకాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఆనందంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

గుండ్లపోచంపల్లిలో ముగ్గుల పోటీలు



మేడ్చల్/శామీర్‌పేట్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి, 4వ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వార్డులోని మహిళలు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, నీయకులు రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ హంసరాణి, బీజేపీ మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


ఘట్‌కేసర్ పీఎస్‌లో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా బీఆర్ఎస్ ఆదివారం బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో భువనగిరి వెళుతున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, సిరాజీలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి ఘట్‌కేసర్ పీఎస్‌కు తరలించారు. మధ్యాహ్నం వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం అవుషాపూర్‌లో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొందరు వ్యక్తులు అవుషాపూర్ గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తుర్కపల్లి మండలం, మల్కాపురం, జగ్యతండాకు చెందిన గగులోతు నందియావా, గగులోతు కిషన్‌గా గుర్తించారు. వారి నుంచి 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు


గుండ్లపోచంపల్లిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మూడుచింతలపల్లిలో...


ట్రోఫీలు అందుకున్న విద్యార్థులు...

కీసర: స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ నాయకుడు కొండబోయిన నాగరాజ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. శిల్పా లేఅవుట్‌లోని సెరినిటీ స్కూల్ వద్ద జరిగిన జయంతి వేడుకల్లో కరాటే విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి గణపురం శ్యాంసుందర్ విద్యార్థులకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బాలరాజు, కౌన్సిలర్లు బుద్ధవరం లక్ష్మి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు బొమ్మిడి బుచ్చిరెడ్డి, వేణుగోపాల్, నక్క కిషోర్ గౌడ్, రవీందర్‌రెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్‌లో..
స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలకేంద్రంలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు


రక్తదానం చేస్తున్న యువకులు

ఘట్‌కేసర్: స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు అవుషాపూర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, కరుణాకర్, మహిపాల్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, భానుయాదవ్, సుకేశ్, సాయిలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


నగదు అందజేస్తున్న రమేష్

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన అంతాయిపల్లి బాలమ్మ కుటుంబానికి ఆదివారం శామీర్‌పేట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుంకి వెంకటేష్ రూ. 10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మల్లేష్‌ముదిరాజ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి, నాయకులు వీరయ్యగౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న రమేశ్‌గుప్తా, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ సబ్బండ వర్గాల నాయకుడని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ గుప్తా మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాలు అనుసరించి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకుని వారి ఆశయ సాధనకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో దాసు, శ్రీనివాసరావు, రాందాసు, రాజేశ్‌కుమార్, శరత్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిలక రాజుకు నివాళి



మేడ్చల్: మేడ్చల్ మాజీ సర్పంచ్ చిలక రాజు (రాజేశ్వర్‌గౌడ్) 64వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పట్టణంలోని మార్కెట్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు 6వ వార్డు కౌన్సిలర్ మణికంఠగౌడ్ మేడ్చల్ మున్సిపాలిటీకి ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్ మహేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి


సాయమ్మ మృతదేహం

ఘట్‌కేసర్: పాము కాటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌కు చెందిన పెద్దపాక సాయమ్మ (72) పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఆమె కొంత కాలంగా లింగాలకుంట సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తుంది. శనివారం సాయంత్రం బంక్ పరిసరాల్లో పాము కాటు వేసింది. వెంటనే అక్కడి సిబ్బంది ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'లక్ష డప్పులు..వెయ్యి గొంతులను' విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

కీసర: నగరంలో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు – వెయ్యి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ అన్నారు. ఆదివారం కీసరలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న మేడ్చల్ జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు వర్గీకరణ సామాజిక న్యాయమని, రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే హక్కు ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. కొందరు నాయకులు వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడటం విచారకరమన్నారు. వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న 'లక్ష డప్పులు – వెయ్యి గొంతులు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు జగన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మండల అధ్యక్షుడు కర్రే గణేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము సుదర్శన్, తుదుం యాదగిరి, శ్రీనివాస్, బక్కని కుమార్, చినింగని బాల్‌రాజ్, శీలం మల్లేష్, తాళ్ల కిరణ్, కానుకుంట్ల శ్యాంకుమార్, బంటు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాదిరెడ్డి స్వప్న ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న 114 మంది మహిళల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండవ బహుమతిగా రూ. 3 వేలు, మూడో బహుమతిగా రూ. 1500 నగదు అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షఫీ, కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎన్‌జీకే మూర్తి, వెంకటరమణ, జస్వంత్ సింగ్, సుధాకర్, ప్రభాకర్, ప్రవీణ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అభిరుచులపై శ్రద్ధ పెట్టాలి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పోచారం: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటూనే ప్రత్యేక అభిరుచులపై శ్రద్ధ చూపాలని శ్రీనిధి యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ నర్సింహారెడ్డి అన్నారు.ఆదివారం యంనంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీలో నిర్వహించిన రంగ్ మంచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధంగా పరిశ్రమించాలన్నారు. ప్రత్యేక అభిరుచుల ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రంగోలి పోటీల్లో ప్రతిభను చాటిన విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ కార్తికేయన్, వివిధ శాఖల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ఘట్‌కేసర్: నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కౌన్సిలర్ కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, శశికళతో కలిసి జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చందుపట్లగూడెం, ఘట్‌కేసర్, అవుషాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానంద దేశ ప్రతిష్టను విశ్వవాప్తం చేసిన చైతన్యమూర్తి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, రామతీర్థ, వెంకటేశ్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, రమేశ్‌పెరిక, జంగారెడ్డి, నాగరాజ్‌ముదిరాజ్, సంజీవరెడ్డి, ఆంజనేయులు, శశిధరన్, సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్‌ముదిరాజ్, ఉదయ్, మహిపాల్‌గౌడ్, సత్తిరెడ్డి, సాయిచరణ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.


స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య తదితరులు